క్లుప్తంగా

5 నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు శనివారం ప్రారంభించారు. తొలుత ఆలయం లోపల, వెలుపల, విగ్రహాలు, గాలిగోపురాన్ని ఫైర్ సిబ్బంది సాయంతో శుభ్రం చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రం శనివారం కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280, కనిష్ఠంగా రూ.250, సరాసరిన రూ.272 ధర పలికినట్లు వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 482 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 428 బేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం వేలానికి 530 బేళ్లు రాగా, 457 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలం కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.250, సగటున రూ.269.62 ధర పలికిందని వివరించారు.

1 నుంచి క్రికెట్ టోర్నమెంట్

వరికుంటపాడు: శ్రీరామనవమి సందర్భంగా ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లెలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో 22వ ఆర్‌సీసీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1,00,116, ద్వితీయ బహుమతి రూ. 30,116, తృతీయ బహుమతి రూ.20,116, నాల్గో బహుమతి రూ.10,116, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా రూ.3,116 నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 31వ తేదీలోగా ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94933 55202, 63823 67650, 70138 98748 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పరామర్శ



అల్లూరు: ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మరణించిన నేపథ్యంలో ఒంగోలులోని వారి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైవీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గ్రాడ్యుయేషన్ డే



కావలి: గౌరవరం సమీపంలోని ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కిండర్‌గార్డెన్ గ్రాడ్యుయేషన్ డేను శనివారం నిర్వహించారు. ఆర్‌ఎస్సార్ చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీఆదిలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై చిన్నారులకు కిండర్‌గార్డెన్ గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేశారు.

చీరలు పంపిణీ

వరికుంటపాడు: ఉగాదిని పురస్కరించుకుని గువ్వాడిలోని మహిళలకు జనసేన మండల ఉపాధ్యక్షుడు యాదగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం చీరలు పంపిణీ చేశారు. యాదగిరి సురేష్, జగదీశ్, రమేష్, కాకుమాని ప్రసాద్, చెన్నకేశవులు, నారాయణ పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో అపోలో, తిరుపతి స్విమ్స్ ఆస్పత్రుల సౌజన్యంతో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మహిమలూరు పంచాయతీ పరిధిలోని కోటపాడుకు రూ.74 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. కలెక్టర్ ఓ ఆనంద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్, ఎస్వీ వర్సిటీ ప్రొఫెసర్ రామిరెడ్డి, దాత కంచి పరమేశ్వరరెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, స్థానిక నాయకులు యర్రగుంట్ల నాగమోహన్‌రెడ్డి, గుండ్రా శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళికలపై సమీక్ష

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏపీఎం ఎండీ ఖాజారహ్మతుల్లా పొదుపు సంఘాల సభ్యులతో వార్షిక రుణ ప్రణాళికలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపు సభ్యులు కుటుంబ ఆదాయ, రుణ వివరాలను వార్షిక క్రెడిట్ ప్లాన్ అమలు చేయాలన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలా చూడాలన్నారు. సీసీలు శ్రీనివాసులు అనిల్ రత్నకుమారి అకౌంటెంట్ విజయమ్మ పాల్గొన్నారు.

రూ.33.17 కోట్లతో మున్సిపల్ బడ్జెట్



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన చైర్‌పర్సన్ రమణమ్మ



బడ్జెట్ సమావేశానికి వస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33.17 కోట్ల అంచనాలతో రూపొందించిన మున్సిపల్ బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ రూ.8.30 కోట్లుగా పేర్కొన్నారు. పన్నుల వసూళ్ల ద్వారా రూ.3.43 కోట్లు, ఇతర ఆదాయాల ద్వారా రూ.7.33 కోట్లు, వినోద పన్ను ద్వారా రూ.50వేలు, సర్‌చార్జి స్టాంప్ డ్యూటీ రూపంలో రూ.1.80 కోట్లు, గవర్నమెంట్ గ్రాంట్‌ల ద్వారా రూ.12.30 కోట్లు వస్తాయని చూపారు. అందులో ఖర్చులు సుమారు రూ.30.36 కోట్లు పోను రూ.2.80 కోట్లను నిల్వగా చూపించారు.

సమష్టి కృషితో ఆత్మకూరు అభివృద్ధి

మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి దేవదాయశాఖ మంత్రి ఆనం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకతీతతంగా అందరూ కలిసి రావాలని, తమ హయాంలో కొన్ని మంచి పనులు చేశామనే సంతృప్తి కలిగేలా అందరం కలిసి ఆత్మకూరును అభివృద్ధి చేద్దామన్నారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిందన్నారు. చివరి ఏడాది పట్టణంలో అన్ని మౌలిక వసతులను కల్పించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేద్దామన్నారు. ఇందుకోసం రూ.53.19 కోట్లు నిధులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి స్థాయిని 200 పడకలకు పెంచేందుకు త్వరలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను తీసుకొస్తామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఏటా ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ పరిధిలోని తిప్ప పోరంబోకు ప్రాంతంలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు కావడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతామన్నారు.

పొదుపు సభ్యులకు చెక్కుల పంపిణీ

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని పొదుపు మహిళలు 15 మందికి పీఎం అజయ్ ఉన్నతి పథకం ద్వారా మంజూరైన రూ.23.40 లక్షల చెక్కులను మంత్రి ఆనం పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఏపీఎం సుజన, తదితరులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కమిషనర్ సీ గంగాప్రసాద్, వైస్‌చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, ఎస్‌కే సర్దార్, 23 మంది కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల హాజరు

మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కలిసికట్టుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో కౌన్సిలర్లు సమావేశమయ్యారు. బడ్జెట్ సమావేశాల్లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించారు. వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్లు కామాక్షయ్యనాయుడు, తిరుపతమ్మ, త్రివేణి, రాధికారెడ్డి, విజయజ్యోతి, గుడి సంధ్య, స్వరూపరాణి, నౌషాద్‌బేగం, దిల్షాద్‌బేగం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



కావలి : బుడమగుంటలో రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు పలక నందకుమార్‌రెడ్డి, పులిమి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదన్‌రావు పాల్గొని రక్తదాతలను సత్కరించారు. అనంతరం గ్రామంలోని 45 గిరిజన కుటుంబాలకు వస్త్రాలను అందజేశారు. జీ రామారావు, పీ సాయికుమార్, రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా పంచాయతీ నిధుల దోపిడీ



మాట్లాడుతున్న మద్దిబోయిన వీరరఘు

చిట్టగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో కూటమి నేతల సహకారంతో పంచాయతీ కార్యదర్శి భారీగా అవినీతికి పాల్పడుతున్నాడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాయతీ వార్డు సభ్యులతో కలిసి శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 2024 జూలై 1 నుంచి 2025 మార్చి వరకు పంచాయతీ నిధుల ఖర్చులపై సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలు, ఇతర ఆధారాలతో నిధుల దుర్వినియోగంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆరు నెలల్లో తాగునీటి వసతి కల్పించేందుకు సుమారు రూ.7లక్షలు, విద్యుత్ సామగ్రి కోసం రూ.1,89,920, బోగోలు దళితవాడ, చెంచులక్ష్మీపురంలో ప్రత్యేక పారిశుధ్య పనుల కోసం రూ.4.47లక్షలు వెచ్చించినట్లు నిధులు డ్రా చేశారని తెలిపారు. బోగోలు దళితవాడ, చెంచులక్ష్మీపురంలో ప్రత్యేక పారిశుధ్య పనుల చేపట్టినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. బోగోలు దళితవాడ, చెంచులక్ష్మీపురంలో ప్రత్యేక పారిశుధ్య పనులపై బహిరంగ విచారణకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. పారిశుధ్య సామగ్రి కోసం ఆరు నెలల్లో సుమారు రూ.4లక్షలు వెచ్చించినట్లుగా నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ వాహనాల కోసం రూ.70వేలు డ్రా చేసినట్లుగా చూపారని, అసలు ప్రభుత్వ వాహనాల కోసం పంచాయతీ నిధులు ఎందుకు వినియోగిస్తారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వివరాలు కూడా సమగ్రంగా లేవన్నారు. జాతీయ పండుగల పేరుతో రూ.50వేలు, షామియానాలకు రూ. 67,970 డ్రా చేశారని తెలిపారు. గ్రామసభల పేరుతోనూ అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. పంచాయ తీ నిధులకు అడ్డగోలుగా లెక్కలు రాసి లక్షల రూపాయలు జేబులో వేసుకున్నారని దుయ్యబట్టారు. చివరకు దండోరా వేసే వ్యక్తులకు రోజుకు రూ.600 ఇచ్చి రూ.1200 ఇచ్చినట్లుగా లెక్కలు రాసుకున్నారని తెలిపారు. ఫినాయిల్, బ్లీచింగ్ పేరుతోనూ నిధులు పక్కదారి పట్టించారన్నారు. పంచాయతీ కార్యదర్శి పంచాయతీ నిధుల వినియోగం చేతివాటం చూపడంతో పాటు ప్రతి పనికి లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ నుంచి ఎటువంటి ధ్రువీకరణ పత్రం కావాలన్నా రూ.10వేలు ఇవ్వనిదే పని జరగడం లేదన్నారు. కూటమి నేతల మద్దతుతో పంచాయతీ కార్యదర్శి చేస్తున్న ఆగడాలు రోజురోజుకూ హద్దు మీరుతున్నాయన్నారు. కలెక్టర్‌ను కలిసి పంచాయతీ కార్యదర్శి అవినీతిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఉగాది శుభాకాంక్షలు

ఆత్మకూరు: విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

రామిరెడ్డి పరామర్శ



శాంతమ్మను పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి : మండలంలోని చెన్నాయపాళెం పంచాయతీకి చెందిన పలువురిని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మల సాయి, చౌటూరు శాంతమ్మను పరామర్శించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన చెన్నాయపాళేనికి చెందిన నాగసూరి రామయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కావలి జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, దామిశెట్టి సుధీర్ నాయుడు తదితరులు ఉన్నారు.

ఉగాది సంబరాలు



ఆత్మకూరు: మాట్లాడుతున్న వక్తలు



ఆత్మకూరురూరల్: సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

ఆత్మకూరు: పట్టణంలోని మేధా పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను శనివారం నిర్వహించారు. పలువురు వక్తలు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం పలువురు రచయితలను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సోమవరపు సుబ్బరాయుడు, యానాదిరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, వెలిశెట్టి నారాయణరావు, రామయ్యస్వామి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, సుబ్బయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం పెళ్లేరు ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు పద్య పోటీలు నిర్వహించారు. ఎంఈఓ మస్తానయ్య ముఖ్యఅతిథిగా హాజరై విజేతలను అభినందించారు. విద్యార్థులకు పద్యాలను నేర్పించిన హెచ్‌ఎం వరలక్ష్మిని అభినందించారు. ఈకార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సరోజ్‌కుమార్, ఉపాధ్యాయులు ఎస్ రమణయ్య, ఎం రవిబాబు, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, వెంకట కృష్ణారెడ్డి, మాల్యాద్రి పెంచల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: వెన్నవాడ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలను శనివారం నిర్వహించారు. విద్యార్థులకు ఉగాది ప్రాశస్త్యంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం కలిశెట్టి రవీంద్రకుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయిని జీవని పాల్గొన్నారు.

డీసీపల్లివాసికి ఎంబీఏలో గోల్డ్‌మెడల్



మర్రిపాడు: డీసీపల్లి మాజీ ఎంపీటీసీ దేవరాల గంగాధర్‌యాదవ్ కుమారుడు దేవరాల గౌతమ్‌తేజయాదవ్ ఎంబీఏలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ప్రఖ్యాత తిరుచ్చి ఐఐఎం ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీఏ పూర్తిచేసిన గౌతమ్‌తేజ తమిళనాడు గవర్నర్ చేతుల మీదుగా పట్టాతో పాటు గోల్డ్‌మెడల్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా గౌతమ్‌తేజను జిల్లా బీసీ ఉద్యోగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకు వెంకటేశ్వర్లుయాదవ్‌తో పాటు పలువురు అభినందించారు.

ఇఫ్తార్ విందు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం మడపల్లి గ్రామంలో రంజాన్ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎంపీపీ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపసర్పంచ్ పూనూరు మాలకొండారెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

జలదంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జీ వెంకటరమణయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. తొలుత మండలాధికారులు శాఖల వారీగా జరిగిన అభివృద్ధిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగే ప్రశ్నలకు మండలాధికారులు సమాధానం చెప్పేందుకు ప్రయత్నిస్తుండగా ఎంపీడీఓ అడ్డు తగులుతూ మీకు ఇచ్చిన సమయంలో అభివృద్ధిని మాత్రమే చదివి వినిపించండి అంటూ అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ మాదిరిగా వ్యవహరించడంపై సర్పంచ్‌లు మండిపడ్డారు. ప్రధాన సమస్యలపై చర్చించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై సర్పంచ్‌లు మాట్లాడుతూ తాము గ్రామాల్లో మంచినీరు వదిలేందుకు మాత్రమే ఉన్నామని ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలపై తాము చేసిన తీర్మానాలను అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, డీటీ జూలీ భాయి, ఏఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పదవులపై హర్షం



కుందుర్తి శ్రీనివాసులు



కుంచల సవీంద్రరెడ్డి



కర్తం సురేంద్రరెడ్డి

కావలి: కావలి నియోజకవర్గానికి చెందిన పలువురిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో పదవులు వరించాయి. రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా కుందుర్తి శ్రీనివాసులు, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శిగా కుంచల సవీంద్రరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శిగా కర్తం సురేంద్రరెడ్డిని నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరి: పట్టణంలోని ఎన్‌బీ పాఠశాలను ఎంఈఓ మస్తాన్‌వలీ శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న రామిరెడ్డి

చిట్టగుంట: ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఆర్‌ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎప్పటికప్పుడు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కడనూతలలోని ఆర్‌ఎస్సార్ కళాశాలలో 17వ వార్షిక వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ కళాశాల వార్షిక నివేదికను వివరించారు. అనంతరం ముఖ్యఅతిథి డీ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగం, విపణి రంగాల్లో శరవేగంగా వస్తున్న మార్పులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ రాజారెడ్డి, ప్రిన్సిపల్ పీవీఎస్‌రెడ్డి, ఏఓ ఆర్వీ రమణారెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.